క్లుప్తంగా

నేడు మండల మీట్

గుర్రంకొండ : గుర్రంకొండ మండల మీట్ గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె సిటీ : ప్రైవేటు పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు డీఈఓ పురుషోత్తంను కోరారు. బుధవారం డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య, ఎల్‌కేజీ, యుకేజీలకు సంబంధించి గుర్తింపు పొందాలని విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వులను పునః సమీక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్స్ కాలనీలో విచారణ

బి.కొత్తకోట : స్థానిక బీరంగిరోడ్డులోని పెయింటర్స్ కాలనీలో బుధవారం తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఆర్‌ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ విచారణ చేశారు. కాలనీ, దానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరిగి నిర్మాణాలు చేపట్టారని ఆందోళనలు జరిగాయి. దీనిపై అధికారులు నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాన్ని, ప్రభుత్వ భూములు, వాటి స్థితిగతులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను విచారించారు. దీనిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

ధరణి డిపాజిట్ పథకంతో అత్యధిక వడ్డీ

మదనపల్లె : చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) ప్రవేశపెట్టిన ధరణి డిపాజిట్ పథకంతో అత్యధిక వడ్డీ లభిస్తుందని బ్రాంచ్ మేనేజర్ చంద్రకళ తెలిపారు. బుధవారం డీసీసీబీ బ్రాంచి విడుదల చేసిన ప్రకటనలో.. ధరణి డిపాజిట్ పథకంలో 450 రోజుల కాలపరిమితితో సీనియర్ సిటిజన్స్‌కు 8.50శాతం వడ్డీ, సాధారణ డిపాజిటర్లకు 8శాతం వడ్డీ లభిస్తుందన్నారు. ఈ పథకంలో చేరిన డిపాజిట్ దారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు. ధరణి డిపాజిట్ పథకానికి సంబంధించి డిపాజిట్లు ఈనెల 16 నుంచి 31 వరకు మాత్రమే స్వీకరిస్తామన్నారు. ప్రజలు ధరణి డిపాజిట్ పథకాన్ని ఆదరించి, తమ పొదుపును డిపాజిట్ చేసి అత్యధిక వడ్డీ పొందాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె సిటీ : స్థానిక పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం మెకోరేటో టెక్నాలజీస్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఏడుగురు ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.మూడు లక్షలు ప్యాకేజీ ఇవ్వనున్నట్లు కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు వరప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న డీఈఓ శ్రీరాం పురుషోత్తం

మదనపల్లె సిటీ : నాడు-నేడు రెండవ దశలో మంజూరైన పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. బుధవారం మదనపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో డివిజన్‌లోని ఎంఈఓలతో నాడు-నేడుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ మండల విద్యాశాఖ కారులు, మండల ఇంజనీర్లు సమన్వయంతో పని చేసి నాడు-నేడు పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులపై అలసత్వం వహిస్తే మండల విద్యాశాఖ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. నాడు-నేడు కింద మంజూరైన పనులు పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంఈఓలను సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఎంఈఓలు తగు చర్యలు తీసుకుని పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే పాఠశాలల్లో అమలు అవుతున్న జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక కార్యక్రమాలపై పర్యవేక్షించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన నాడు-నేడు పనులపై శ్రద్ధపెట్టి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా పనుల పురోగతిపై వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష సెక్టార్ అధికారి కరుణాకర్, డివిజన్ పరిధిలోని ఎంఈఓలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం చీకలబైలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నాడు కింద జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని డీఈఓ శ్రీరాం పురుషోత్తం అన్నారు. బుధవారం చీకలబైలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వివిధ కారణాలతో నాడు-నేడు పనులు నిలిచిపోవడంతో క్షేత్రస్థాయిలో పాఠశాలను సందర్శించి అందుకుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్పవల్లీ... చల్లంగా చూడు తల్లీ

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు నయనమనోహరంగా సాగుతున్నాయి. బుధవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి సారెను శేషమహల్ ఏరియా, నెహ్రూనగర్ వాసులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం వాసవీ మహిళా సంఘంచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీచౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాజుల అలంకారంలో భక్తులను ఆకట్టుకుంది.పలు రంగుల గాజులతో అమ్మవారిని అలంకరించారు. ఉదయం అమ్మవారి అభిషేకాలు,పూజలు జరిగాయి. తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అన్నదానప్రసాద వితరణ చేశారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో లలిత త్రిపుర సుందరిదేవి అమ్మవారిని వారాహి అలంకరణతో అలంకరించారు. అర్చకులు ఫణికుమార్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి భక్తులు ప్రసాద వితరణ చేశారు. స్థానిక సీటీఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాయిత్రిదేవి అలంకారం చేశారు.

అమ్మవారి సేవలో ఎంపీ, ఎమ్మెల్యే

స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మంగళవారం రాత్రి రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషాను దర్శించుకున్నారు.


మదనపల్లె సిటీ : వాసవీమాత సేవలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా తదితరులు


అన్నపూర్ణదేవి అలంకారంలో వాసవీ అమ్మవారు

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, దేవతా సతీష్, గిరిధర్,రవి తదితరులు ఎంపి,ఎమ్మెల్యేలకు ఘనంగా స్వాగతం పలికారు.

అన్నపూర్ణాదేవి అలంకరణలో..

పీలేరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అన్నాపూర్ణాదేవి అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం రెడ్డెమ్మతల్లితోపాటు గుర్రంకొండ గ్రావుదేవతలైన గంగమ్మతల్లి, శ్రీపోలేరమ్మ తల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు శ్రీమహాలక్ష్మి దేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను రంగు రంగుల పుష్పాలతో, పట్టుచీరెలు, దివ్యాభరణాలతో అమ్మవారిని శోభయమానంగా అలంకరించారు. చక్కెరపొంగలి నైవేద్యాలు అమ్మవార్లకు సమర్పించారు. ఈసందర్భంగా ఆలయాల్లో అమ్మవారి కీర్తనలు, భజనలు నిర్వహించారు. ఆలయాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల అనంతరం కళాకారుల భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకొన్నాయి.

మహాలక్ష్మీదేవి అలంకరణలో..

తంబళ్లపల్లె : దసరా వేడుకలలో భాగంగా బుధవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. మల్లయ్య కొండపై గల గౌరమ్మ ఆలయంలో పూజారి శేఖర్ అమ్మవారికి మహాలక్ష్మీ ఆకారంలో ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

వాల్మీకిపురం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక నల్లవీరగంగాభవాని ఆలయంలో గంగాభవాని అమ్మవారు శ్రీ వెంకటేశ్వర స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయంలో కామేశ్వరి అమ్మవారు వైష్ణవిదేవి అలంకరణ, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మూగాంబికాదేవిగా, చింతపర్తిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేష పూజలు నిర్వహించారు.

ధనలక్ష్మీదేవి అలంకరణలో..

రామసముద్రం : మండలంలోని గుంతయంబాడి గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా పూజలు నిర్వహించారు. అలాగే గంపనపల్లె, కొండూరు, గుంతలపేటలోని శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారు , రామసముద్రంలోని దుర్గలమ్మ, కన్యకాపరమేశ్వరి, తిరుమలరెడ్డిపల్లెలోని మారెమ్మ ఆలయంలో అమ్మవారిని అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.


రామసముద్రం : ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరిదేవి


మదనపల్లె సిటీ : గాజుల అలంకారంలో అమ్మవారు


పీలేరు : అన్నపూర్ణాదేవి అలంకరణలో యల్లమ్మతల్లి


అన్నపూర్ణాదేవి అలంకరణలో రౌద్రాల అంకాలమ్మ


గుర్రంకొండ : శ్రీ మహలక్ష్మీదేవి అలంకారంలో రెడ్డెమ్మతల్లి


వాల్మీకిపురం : వెంకటేశ్వర స్వామి అలంకరణలో ..


వాల్మీకిపురం : వైష్ణవిదేవి అలంకరణలో కామేశ్వరి దేవి


తంబళ్లపల్లె : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- కోట్ల రూపాయలతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు
- 2వవార్డులో రూ.2కోట్లతో 2 కి.మీ. సీసీరోడ్లు, డ్రెయిన్లు
- మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా


సీసీరోడ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : మున్సిపాలిటీలో మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, 35 వార్డుల్లోనూ ప్రజలు కోరినవిధంగా అభివృద్ధి పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని 2వవార్డు లక్ష్మీనగర్‌లో కౌన్సిలర్ ఆర్.శివారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ నిధులు రూ.2కోట్లతో 2 కి.మీ.ల మేర నిర్మిస్తున్న సీసీరోడ్లు, డ్రెయిన్లుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 35వార్డుల్లో ఏడాదిపాటు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ప్రజాసమస్యలను గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రస్తావించిన సమస్యలన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. అందులో భాగంగా 1, 2 వార్డుల్లో కొండ, గుట్ట ప్రాంతాలు అధికంగా ఉండటం, సరైన మౌలికవసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకున్నామన్నారు. పట్టణంలోని అన్నివార్డుల్లో 100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీపై నమ్మకంతో ప్రజలు ఓట్లేసి గెలిపించినందుకు కృతజ్ఞతగా 2వవార్డులో గతంలో ఎన్నడూ లేని విధంగా 2 కిలోమీటర్లు సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మిస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలిందని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప పచ్చనాయకులు చేసిన అభివృద్ధి లేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో మంచి జరిగిందని భావిస్తేనే నిండు మనస్సుతో ఓటు వేసి ఆశీర్వదించండని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శ్రావణి, ఏఈ బండపల్లిశిరీషా, వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు ఎస్వీ.రమణ, రామిశెట్టిశివయ్య, డిష్‌రామకృష్ణారెడ్డి, మేస్త్రీశ్రీనివాసులు, ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు తట్టిశ్రీనివాసులురెడ్డి, గుండ్లూరురఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, ఎల్‌ఐసీ.సుధాకర్, ఇస్మాయిల్, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, బావాజీ, పోతబోలునాగరాజ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కలికిరిలో గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీ కలికిరి-2 సచివాయం పరిధిలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధి, నూరు కాలని, గిరిజనకాలని, సిద్ధార్థ స్కూల్ ఏరియా, వెంకటేశ్వరపురం, పీలేరు రోడ్డు ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదాం


గ్యారంపల్లెలో బాల్య వివాహాల నిర్మూలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కేవీపల్లె : సమష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లె అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో బాల్యవివాహాల నిర్మూలనపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నవయస్సులో వివాహన వలన త్వరగా ముసలితనం వస్తుందని, పలు దుష్ఫలితాలు ఉంటాయని తెలిపారు. 18 ఏళ్లలోపు వివాహం చేస్తే రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ. లక్ష జరిమానా ఉంటుందని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలకు సత్వరం పరిష్కారం

జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్


జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై శ్రద్ధపెట్టి సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్‌ఖాన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్‌సీ భవనంలో 'జగనన్నకు చెబుదాం స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి న్యాయం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చించారు. ఇప్పటికే జిల్లాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలనేది ఆయన ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా అధికార యంత్రాంగం సమక్షంలో ప్రజా సమస్యలు పరిష్కారించేందుకు మండల కేంద్రాలు వేదికలుగా కావడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పోలప్ప, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ స్థాయి అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సేవకు ఎప్పుడూ ముందుంటాం

ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


పత్తేగడ గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

కలికిరి : రాజకీయాలతీతంగా ప్రజాసేవకు తామెప్పుడూ ముందుంటామని రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే రూ.1.2 కోట్ల నిధులతో నిర్మాణాలు పూర్తి చేసుకున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. కలికిరి-4 గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, పత్తేగడ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అంతకు మునుపు కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువుముందరపల్లిలో మండల పరిషత్ నిధులు రూ.6.5లక్షలతో ఏర్పాటు చేసిన 5కె కెపాసిటీ గల నీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలలో మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మాజీ ఎంఎల్‌సీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు డైరెక్టర్ భాస్కర్ నాయుడు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, మైనార్టీ నేత ఎంఐ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

డీసీసీ అధ్యక్షుడు షేక్ అల్లాబక్షు

మదనపల్లె : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నమయ్య జిల్లా డీసీసీ అధ్యక్షుడు షేక్‌అల్లాబక్షు అన్నారు. బుధవారం పట్టణంలోని బాబూకాలనీలో నియోజకవర్గ కన్వీనర్ రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అవినీతి, అరాచక, దుర్మార్గ పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపేందుకు సమయం ఆసన్నమైందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరల పెంపుతో పేదప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. భారత్ జోడో పాదయాత్రతో ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ జాతీయస్థాయిలో ప్రజల మన్ననలు పొందారన్నారు. జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు చెన్నకృష్ణ, అమీర్, హబీబ్, షమీవుల్లా, రిజ్వానా, షబ్బీర్, రియాజ్, మణి, చిన్ను, నిజాం పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం


మదనపల్లె : కురవంక జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


అంగన్‌వాడీల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


పెద్దమండ్యం : శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది


వాల్మీకిపురం : జగన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు విశేష స్పందన

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశారని, తద్వారా పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఖరీదైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని 7, 8 వార్డుల సచివాలయ పరిధిలో రామారావుకాలనీ పార్కు, కోటబడి మున్సిపల్ హైస్కూల్, మండలంలోని కురవంక పంచాయతీలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎమ్మెల్యే నవాజ్ బాషా పరిశీలించారు. శిబిరానికి వచ్చిన ప్రజలను పలుకరించి, వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఎంపీపీ రెడ్డెమ్మ, వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, వెలుగుచంద్ర, ఎంపీటీసీ బెల్లే హారతి, కౌన్సిలర్లు మేడికుర్తిలత, డిష్‌రామకృష్ణారెడ్డి, మేస్త్రీశ్రీనివాసులు, రేణుక, వినుతాభాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు పోతబోలునాగరాజ, మునిశేఖర్, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

ములకలచెరువు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సాయిలీలా, సర్పంచు వై.విజయమ్మ, ఎంపీటీసీ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండలంలోని బురకాయలకోట ఉన్నత పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి తనిఖీ చేసి వైద్య సేవలపై ఆరాతీశారు. సుమారుగా 500 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యులు జాహ్నవిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వై.రవిశేఖర్‌రెడ్డి, నాయకులు ఫక్రుద్దీన్, మంజునాథ్, సోముశేఖర్, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష

పెద్దతిప్పసముద్రం : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని ఎంపీపీ మహమూద్, జేసీఎస్ మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో ఎంపీడీవో గిరిధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్థానిక సర్పంచ్‌లు భాగ్యమ్మ, తమక శంకర్, కో‌ఆప్షన్ ఖాదరవలి, ఎంపీటీసీ ప్యారీజాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం


పెద్దమండ్యం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని వెలిగల్లు గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. క్యాంపుకు వచ్చిన ప్రజలకు, రోగులకు వైద్యసేవల కోసం అధికారులు కౌంటర్‌లు ఏర్పాట్లు చేశారు. నలుగురు డాక్టర్‌ల బృందం క్యాంపుకు వచ్చిన వారికి చికిత్సలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జనార్దన్, సిహెచ్‌వో క్రిష్ణయ్య, డాక్టర్‌లు హరివర్మ, ఇమ్మాన్యుల్, నజ్మా, పంచాయతీ కార్యదర్శి శైలజ పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

వాల్మీకిపురం : ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పేదలు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి అర్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 260 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

ఆధ్యాత్మిక, సమాజసేవా కార్యక్రమాలకు శ్రీకారం

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని చారిత్రాత్మకమైన టీఎన్ బంగ్లాలో శ్రీరామకృష్ణమఠం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టినట్లు టీఎన్ కుటుంబీకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎన్ అరవిందరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన బెంగళూరు రామక్రిష్ణా మఠం స్వామీజీలు బరిగేష్, ఆనందాజీ, బోధస్వరూపానందాజీ, కడప రామకృష్ణమఠం ప్రతినిధులు అనుపమానంద జీ, స్వామి సంకర్షణామ్‌జీలు టీఎన్ బంగ్లాను సందర్శించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగ్లాలో స్థానిక ప్రజలతో చర్చ, సమావేశం జరిగింది. పలువురు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మహిళలకు కుట్టుశిక్షణ, గార్మెంట్‌తో ఉపాధి, యువతకు కంప్యూటర్స్, స్పోకన్ ఇంగ్లీష్, రైతులకు సుస్థిర వ్యవసాయ నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టి శిక్షణతో పాటు సహకారం అందించాలని కోరారు.


స్థానికులతో టీఎన్ అరవిందరెడ్డి, రామక్రిష్ణమఠం స్వామీజీలు